

వాలంటీర్లతో ఓటర్ల సర్వే చేయించొద్దు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి–డుంబ్రిగుడ: ప్రస్తుతం నిర్వహిస్తున్న ఓటర్ లిస్ట్ సర్వేలో గ్రామ వాలంటీర్లను తీసుకెళ్లకుండా అధికారులే నిర్వహించాలని స్థానిక జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేశారు. స్థానిక మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఓటర్ లిస్టు సర్వేలో భాగంగా బిఎల్ఓలు, అధికారులకు అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా ఓటర్ లిస్టులు చేర్పించడానికి ఓటర్ నమోదు చేసే ప్రక్రియపై బిఎల్ఓలకు కలెక్టర్ అవగాహనపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఓటర్ లిస్టు నమోదులో ఎటువంటి నిర్లక్ష్య ధోరణి వ్యవహరించకుండా బిఎల్ఓ లు, అధికారులు పగడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహాసిల్దార్ సిహెచ్ నాగమ్మ, ఎంపీడీవో ఉషారాణి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

పెరిగిన శబరి నీటి మట్టం

కోతకు గురైన జాతీయ రహదారి

పొంగి ప్రవహిస్తున్న వాగులు వంకలు



కల్లేరు-కుయగురు గ్రామాల మధ్య జాతీయ రహదారి కోతకు గురైన దృశ్యం

ప్రజాశక్తి–చింతూరు

గత వారం రోజుల నుండి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నది ప్రవాహం వల్ల శబరి నది పోటెత్తింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 37.4 అడుగులకు చేరుకోగా మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఎత్తివేశారు. చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం కొంతమేర పెరిగి 28 అడుగులకు చేరుకుంది. ఒడిశాలోని పొట్టేరు వాగు పొంగి ప్రవహించడంతో సీలేరు నది ఉగ్రరూపం దాల్చింది. అడవుల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలు కారణంగా ముంపు మండలాలు తడిసి ముద్దవుతున్నాయి. వర్షాలు, వరదలతో జన జీవనం అతలాకుతలమవుతుంది.

ఆంధ్ర నుండి ఒడిశా వెళుతున్న గుప్తా ట్రావెల్ బస్సు కుయగురు వాగు దాటుతుండగా ప్రవాహంలో చిక్కుకుంది. స్థానికులు, అధికారులు వెంటనే స్పందించి జెసిబిల సహాయంతో బస్సును ఒడ్డుకు చేర్చారు లేకుంటే భారీ ప్రాణ నష్టం జరిగి ఉండేది. వరద ప్రవాహానికి కల్లేరు–కుయగురు గ్రామాల మధ్య జాతీయ రహదారి 326 కోతకు గురైంది. గతేడాది కూడా ఇదే ప్రదేశంలో రోడ్డు కొట్టుకుపోయింది. ఈ మార్గంలో ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు బస్సుల రాకపోకలు, నిత్యావసర సరుకుల రవాణా సాగుతూ ఉంటుంది. అధికారులు స్పందించి వెంటనే ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు. మరో రెండు రోజులు ఇదే తరహాలో వానలు కురిసే అవకాశం ఉందని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

వర్షాలకు కారిపోతున్న తహశీల్దారు కార్యాలయం

చింతూరు : భారీ వర్షాల కారణంగా చింతూరు మండల తహశీల్దారు కార్యాలయ స్లాబ్ లీకేజీ కావడంతో సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలో విలువైన పత్రాలు రికార్డులు వర్షానికి తడిసి పాడవుతున్నాయి. గతంలో కూడా భారీ వర్షాలకు ఇదే తరహాలో కార్యాలయం మొత్తం కారిపోవడంతో విధులు నిర్వహించడానికి కూడా వీలు లేకుండా మారిపోయింది. ఇప్పటికైనా డివిజన్ స్థాయి అధికారులు చొరవ చూపి తహశీల్దారు కార్యాలయ స్లాబ్‌కు మరమ్మతులను చేయాలని కోరుతున్నారు.



కారుతున్న చోట గొడుగు పెట్టిన దృశ్యం

పొంగిపొర్లుతున్న వాగులు


విఆర్.పురం : మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. అన్నవరం–ఉమ్మడివరం మధ్యలో ఉన్న బ్రిడ్జి పైనుండి వరద నీరు పొంగి ప్రవహిస్తుండడంతో మండలంలోని 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఈ గ్రామాల ప్రజలు సోమవారం వారపు సంతకు రాలేకపోయారు. మరో వైపు ఐదు రోజులుగా పునరావాస కేంద్రాల్లో ఉన్న ఇంతవరకు ఏ అధికారి పట్టించుకోలేదని, సరుకులు ఇవ్వలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు పునరావాస కేంద్రాలకు వచ్చి నిత్యవసర సరుకులు ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేశారు.



విఆర్.పురం మండలంలో పొంగి ప్రవహిస్తున్న వాగు

వరద బాధితులకు మాజీ ఎంపీ పరామర్శ

కూనవరం : మండలంలోని కోతులగుట్ట వరద బాధితుల పునరావాస కేంద్రాన్ని మాజీ ఎంపీ సోడె రామయ్య, టిడిపి నాయకులు సందర్శించారు. వారి కష్టాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావస కేంద్రాల్లో వరద బాధితులు పడుతున్న బాధలు వర్ణనాతీతమని పేర్కొన్నారు. ఆగస్టు నెలలో ఇవ్వాల్సిన రేషన్ బియ్యం ఇచ్చారు తప్ప అదనంగా ఎటువంటి నిత్యవసర సరుకులు ఇవ్వలేదని వరద బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ రామయ్య మాట్లాడుతూ గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయిందని, ప్రతి కుటుంబానికి 25 కేజీలు బియ్యం రెండు నెలలకు సరిపడా నిత్యవసరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండేళ్లుగా సర్వేల ద్వారా కాలయాపన చేస్తున్నారు తప్ప ఎటువంటి ప్యాకేజీ ఇవ్వలేదని వాపోయారు. కోఆప్షన్ సభ్యులు షరీఫ్, తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసులో రంజిత్ కుమార్ పాల్గొన్నారు.



పునరావాస కేంద్రంలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ సోడే రామయ్య

ఘాట్ రోడ్డులో కూలిన భారీ వృక్షం

నిలిచిపోయిన వాహనాలు

మారేడుమిల్లి : వారం రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో సోమవారం తెల్లవారుజామున భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు గంటలపాటు వర్షంలో రోడ్డుపైనే వేసి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో సమీప గ్రామమైన వాలమూరు గ్రామస్తుల సహకారంతో ప్రయాణికులు చెట్టును తొలగించుకొని రాకపోకలను పునరుద్ధరించారు. భారీ వర్షాలకు తరచుగా భారీ వృక్షాలు కూలడంతో వారానికి రెండు మూడు సార్లు ప్రయాణికులు అవస్థలు ఎదురుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని, ఈ సమస్యపై అధికారులు స్పందించి ఘాట్ రోడ్డుపై పెట్రోలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వారం రోజులుగా ముసురు

దయనీయంగా దినసరి కూలీల పరిస్థితి

ప్రజాశక్తి –సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో వారం రోజుల నుంచి ముసురు పెట్టడంతో దినసరి కూలీలు పరిస్థితి దయనీయంగా మారింది. రెక్కాడితే గానీ డొక్కడాని పరిస్థితిలో ఉన్న నిరుపేద కూలీలకు కూలి పనులు లేక అనేక ఇబ్బందులు గురవుతున్నారు. రాత్రి పగలు చిన్నపాటి వర్షపు జల్లులు పడుతూ ముసురు పట్టడంతో ఇండ్ల నుంచి బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు సీలేరు, దారకొండ, దుప్పులవాడ పరిసర ప్రాంతాల్లో గత వారం రోజుల నుంచి ముసురు పట్టడంతో దూర ప్రాంతాల నుంచి సీలేరు నిత్యవసర సరుకులు కొనుక్కోవడానికి గిరిజన సైతం రాలేని పరిస్థితి నెలకొంది. ఇదేవిధంగా ముసురు కొనసాగితే దినసరి కూలీలు బతుకుతెరువు గడవడం కష్టమేనని పలువురు చెబుతున్నారు.



గుడారాలు వద్ద ముంపు బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

ముంపు బాధితులకు నిత్యావసర సరుకులు అందించాలి

గుడారాల్లో తలదాచుకుంటున్న వారికి సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి–విఆర్.పురం

మండలంలో 20వ తేదీన వరద పెరగటంతో అధికారుల ఆదేశాల మేరకు పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి, ఎత్తైన ప్రాంతంలో గుడారాలు ఏర్పాటు చేసుకొని తలదాచుకుంటున్న ముంపు బాధితులకు తక్షణమే నిత్యావసర సరుకులు అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. ఐదు రోజులైనా పునరాసాల్లో ఉన్న ప్రజలకు నిత్యావసరాలు, ఎటువంటి సౌకర్యాలు కల్పించక పోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సిపిఎం నాయకులు ముంపు బాధితుల గుడారాలను సందర్శించి బాధితులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం కనీసం వరద బాధితులకు తిండిపెట్టే పరిస్థితిలో లేదని విమర్శించారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఎటువంటి సౌకర్యాలు చేయకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. రవాణా ఛార్జీలు ఇరువైపులా రూ.4వేలు వరకు అవుతుందని, వాటిని ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. తక్షణమే వారికి రూ.10వేలు, నిత్యావసర సరుకులు, కిరోసిన్, బియ్యం, పాలు, అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గూటాల శ్రీనివాసరావు, సీరపు తాతబాబు, నిర్వాసితులు పాల్గొన్నారు.

భయంతో జీవిస్తున్నాం



అధికారులు మమ్మల్ని పునరావాస కేంద్రాలకు పంపించి ఐదు రోజులైనా అధికారులు, వాలంటీర్లు మమ్మల్ని చూడటానికి రాలేదు. నిత్యావసర సరుకులు ఇవ్వలేదు. మేము వెంట తెచ్చుకున్న సరుకులు అయిపోయాయి. పాల ప్యాకెట్, మంచినీరు వంటివి కూడా అందించలేదు. తక్షణమే సరుకులు పంపిణీ చేయాలి. రాత్రి వేళలో దోమలతో నరకం చూస్తున్నాం. ఎటునుండి ఏ పురుగు వస్తుందోనని భయంతో జీవిస్తున్నాం. తక్షణమే నిత్యావసరాలు ఇవ్వాలి.

– బాగుల గోవిందరాజు, ఒడ్డుగూడెం, విఆర్.పురం మండలం

నిత్యావసరాలు అందించాలి



అధికారులు మమ్మల్ని పునరావాస కాలనీలకు తరలించారు. మేము తెచ్చుకున్న సరుకులు రెండు రోజులకే అయిపోయాయి. ఈ మూడు రోజుల నుండి మంచినీళ్లు తప్ప ఆహారం ఏది దొరకలేదు. మాకు నిత్యవసర సరుకులు, పాల ప్యాకెట్, కిరోసిన్, బరకాలు ఇవ్వాలి.

– పల్లిదల నాగేశ్వరరావు, ఒడ్డుగూడెం, విఆర్.పురం మండలం



కాఫీ తయారీని పరిశీలిస్తున్న కాంతిలాల్ దండే

వంతెనల పనులు పూర్తి చేయాలి

ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే


ప్రజాశక్తి– అనంతగిరి: ఏజెన్సీ ప్రాంతంలో మారు మూల గ్రామాలకు రహదారుల సౌకర్యార్థంగా నిర్మిస్తున్న వంతెనల పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ. కాంతిలాల్ దండే ఆదేశించారు. సోమవారం మండలంలో సుడిగాలి ప్రకటించారు. మండలంలోని ఎగువసభ పంచాయతీ బీసుపురం గ్రామంలో సందర్శించారు. కాఫీ పౌడర్ తయారీ విధానం పై అడిగి తెలుసుకున్నారు. కాశీపట్నం పంచాయతీ పరిధి సారవనిపాలెం, చిలకలగెడ్డ పంచాయతీ జీలుగులపాడులో జరుగుతున్న వంతెనలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులకు సంబంధించి సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వంతెనల పనులు వేగవంతం జరిగేందుకు తగిన ప్రణాళికను తయారు చేసి నివేదిక అందజేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు పీఓ. అభిషేక్ ను ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ శ్రీనివాస్, డిఇ.సుబ్బారావు, జెఇ.గణేష్ పాల్గొన్నారు

సమస్యలపై వినతి..

పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలపై స్థానిక ఎంపీటీసీ టీ.మిత్తుల, సర్పంచ్ జి.అప్పారావు ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ. కాంతిలాల్ దండే కు లిఖితపూర్వకంగా విన్నవించారు. జీలుగులపాడు వంతెన పనులు పూర్తి చేస్తే అనంతగిరి మండలం, విజయనగరం జిల్లా మెంటాడ మండలం అడ్డతీగల పంచాయతీ ప్రజల కష్టాలు తీరుతాయని తెలిపారు.

జెడ్‌పిటిసి గంగరాజు వినతి

అనంతగిరి: విద్యాశాఖ సమస్యలు, మాతృభాష వాలంటిర్లు, సిఆర్‌టిల సమస్యలు పరిష్కారం చేయాలని జడ్పిటిసి దీసరి గంగరాజు కోరారు. ఈ మేరకు ట్రైబల్ వెల్ఫేర్ ప్రదాన కార్యదర్శి కాంతిలాల్ దండేకు లిఖితపూర్వకంగా విన్నవించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 1242 మంది మాతృభాష వాలంటీర్లు పని చేస్తున్నారని, సుమారు 50000 మంది గిరిజన విద్యార్థులకు మాతృభాషలో విద్యా బోధన అందిస్తున్నారని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ మాతృభాష వాలంటీర్లను ప్రతి ఏడాది కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాష వాలంటీర్ల జిల్లా అధ్యక్షులు పాంగి .కుమారి, వాలంటర్లు పాల్గొన్నారు.



సమస్యలపై వినతిపత్రాన్ని ఇస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

మణిపూర్‌లో ఆటవిక చర్యలపై

రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

-ఆ రాష్ట్ర సిఎం రాజీనామా చేయాలి

-ఆదివాసులకు రక్షణ కల్పించాలి

- ఆదివాసి గిరిజన సంఘం నేతలు

-పలు చోట్ల ప్రజా సంఘాల ఆందోళనలు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి–పాడేరుటౌన్: మానవత్వాన్ని మంటగలిపేలా మణిపూర్ రాష్ట్రంలో చోటు చేసుకున్న అత్యంత ఆటవిక చర్యల నివారణకు రాష్ట్రపతి తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని సిఐటియు కార్యాలయంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.సుందరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మణిపూర్ అల్లర్లను అరికట్టడం లోనూ, ఆదివాసి మహిళలకు భద్రత కల్పించడంలోనూ విఫలమైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మైతేలను ఎస్‌టి జాబితాలో చేర్పించి రాజకీయ ప్రయోజనం పొందేందుకే ప్రణాళిక బద్ధంగా మణిపూర్ లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా చిచ్చుపెట్టారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతోనే ఆదివాసీలపై దాడులు జరుగుతుందని బాధిత మహిళలు ప్రకటించారని తెలిపారు. మణిపూర్ హింసకాండపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన మోదీ ప్రభుత్వ తీరుపై ప్రజలందరూ ఖండించాలని కోరారు. మణిపూర్ ఘటనపై రాష్ట్రపతి మౌనానికి కారణం బిజెపి అని తెలిపారు. రాష్ట్రపతి జోక్యం చేసుకుని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులకు పరిహారం, నష్టపరిహారంతో పాటు వరద ప్రాంతాల్లో ప్రజలకు భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 5, 6వ షెడ్యూల్డ్ ప్రాంతంలోని హక్కులు, రిజర్వేషన్ ఉల్లంఘన జరుగుతోందని, ఆదివాసీలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర మాట్లాడుతూ, అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లు ద్వారా గ్రామ సభకున్న అధికారాన్ని రద్దు చేస్తున్నారని, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు ఆమోదానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలను అధికార, ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, మణిపూర్ ఆదివాసీ మహిళలపై పాశవిక చర్యలకు పాల్పడిన వారిపై వెంటనే ఎస్ సి, ఎస్ టి అట్రాసిటీ కేసు పెట్టాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ చీకటి నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.భాగ్యలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి నాగరాజు, మెడికల్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు కె.లక్ష్మణ్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దాసమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభుదాస్, నరేష్, చిన్నారావు, మాతృభాష విద్య వాలంటీర్ల సంఘం రాష్ట్ర నాయకులు సర్బు నాయుడు, సత్యబాబు, సత్యనారాయణ, గిరిజన సమాఖ్య జిల్లా కమిటీ నాయకులు లక్ష్మణ్, నిరుద్యోగ సంఘ నాయకులు వై.కుమార్ పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజా సంఘాల ఆందోళన

అనంతగిరి: మణిపూర్ రాష్ట్రంలో హింసాకాండను ఆపాలని ఆదివాసీ గిరిజన సంఘం, విద్యార్థి సంఘాల. ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దీసరి .గంగరాజు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి శాంతియుత వాతావరణం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోడి మౌనం వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోమ్మేల నాగులు, టోకూరు సర్పంచ్ కిల్లో. మోస్య, గిరిజన సంఘం కార్యదర్శి జన్ని. సుబ్బారావు, మహిళా సంఘం నాయకులు దీసరి. దేముడుమ్మ, సీపీఎం నాయకులు గెమ్మెల దేవన్న, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు



అనంతగిరిలో నినాదాలు చేస్తున్న గంగరాజు, విద్యార్థులు

డుంబ్రిగుడ: మణిపూర్‌లో ఆదివాసి మహిళలపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటనను నిరసిస్తూ మానవ హక్కుల నేర నిరోధక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మండల పురవీధుల్లో ర్యాలీ కొనసాగించి ఘటనకు పాల్పడిన వ్యక్తులను తక్షణమే అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె కృష్ణకుమారి, అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ, ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ కె.రవీంద్ర, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐద్వా నిరసన ర్యాలీ



ర్యాలీ చేపడుతున్న ఐద్వా మహిళా నేతలు

ప్రజాశక్తి–కూనవరం

మణిపూర్‌లో గిరిజన తెగ ప్రజలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను నిరసిస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన మండలంలోని చినార్కూరు గ్రామంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు కుంజా రాధా మాట్లాడుతూ కనీసం మానవత్వం లేకుండా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వం వహించాలని డిమాండ్ చేశారు. మెజారిటీగా ఉన్న వర్గం మైతీలు కుకీ తెగ ప్రజలపై మారణకాండ సృష్టిస్తుంటే మోడీ ప్రభుత్వం, మణిపూర్‌లోని రాష్ట్ర బిజెపి ప్రభుత్వం పరోక్షంగా ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. మణిపూర్ రాష్ట్రంలో ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి మరీ బిజెపి, ఆర్ఎస్ఎస్ మూకలు దాడులు చేశాయని పేర్కొన్నారు. తక్షణమే దోషులను గుర్తించి కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సీలేరు : మణిపూర్‌లో ఆదివాసీ మహిళలను వివస్త్రాలను చేసి ఊరేగించి అత్యాచారం చేసి చంపేసిన ఘటనకు నిరసనగా మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ కొర్ర బలరాం మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో సభ్య సమాజం తలదించుకొనేట్లు ఆదివాసి మహిళలను హత్యాచారం చేసి హత్య చేయడం దారుణమన్నారు. ఈ మానవ మృగాలను బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బొజ్జిబాబు, ఆదివాసీ జెఏసి నాయకులు మొట్టడం రాజబాబు, లోచెల రామకృష్ణ, కొర్ర మల్లేశ్వరావు, రీమెల పాలు, బత్తుల సిద్దార్థమార్క్, కొర్ర నీలకంఠం, టిడిపి నాయకులు ముక్కల మహేష్, వైసిపి నాయకుడు వంతల అరుణ్ కుమార్, వైస్ సర్పంచ్ కొర్ర రాంబాబు పాల్గొన్నారు.



రోడ్డుపై చేరిన నీరు

అరకులోయలో భారీ వర్షం

ప్రజాశక్తి-అరకురూరల్:మండలంలోని సోమవారం భారీ వర్షం కురిసింది. సుమారు మూడు గంటలు సేపు కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ వర్షపు నీటితో జలమయమయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రానికి వివిధ పనులు నిమిత్తం వచ్చిన గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- పెదబయలు: మావోయిస్టు అమర వీరుల వారోత్సవాల నేపథ్యంలో స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో ముమ్మరంగా సోమవారం సంతలో వాహనాల తనిఖీలు నిర్వహించారు.సోమవారం సంతకు వచ్చిన వాహనాలను క్షుణంగా పరిశీలించారు. ఎటువసంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

హైదరాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అదనపు రద్దీని క్లియర్ చేయడానికి హైదరాబాద్-కటక్-హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైలు సేవలను పొడిగించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. 07165 హైదరాబాద్-కటక్ ప్రత్యేక రైలు ఆగస్టు 1 నుండి సెప్టెంబర్ 26 వరకు ప్రతి మంగళవారమూ రాత్రి 20.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ, సాయంత్రం 17.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. 07166 కటక్-హైదరాబాద్ ప్రత్యేక రైలు ఆగస్టు 2వ తేదీ నుండి సెప్టెంబర్ 27వ తేదీ వరకు ప్రతి బుధవారమూ రాత్రి 22:30 గంటలకు కటక్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ, రాత్రి 21.00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దారోడ్డు, భువనేశ్వరాక్ మీదుగా ప్రయాణిస్తాయి.

జనతా బజార్ దుకాణాలను ఖాళీ చేయించొద్దు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : జివిఎంసి 35వ వార్డులో ఉన్న జనతా బజార్ శిథిలావస్థలో ఉన్నందున, దానిని తొలగించి కొత్త దుకాణాలను నిర్మిస్తామని చెప్పి ఖాళీ చేయాలని జివిఎంసి అధికారులు కోరడం సరికాదని కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

పథకాలతో గిరిజనులకు లబ్ధి

జెసి శివ శ్రీనివాసు



ధ్రువపత్రాలు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాసు

ప్రజాశక్తి-పాడేరు టౌన్/ జి.మాడుగుల: అందరి సహకారంతోనే జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందని జెసి జె.శివ శ్రీనివాసు పేర్కొన్నారు. సోమవారం జి మాడుగుల: మండలంలోని సొలభం-2 (గొందిపాడు), బొయితి సచివాలాయల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. సొలభం-2 సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న జెసి మాట్లాడుతూ..అవసరమైన ధృవపత్రాలు పొంది అర్హత కలిగిన పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని, పథకాల లబ్ధిని పొందాలని సూచించారు. లబ్దిదారులకు అవసరమైన ధ్రువపత్రాలపై వాలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు మాట్లాడుతూ, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ధృవపత్రాలు జారీ చేయటం జరుగుతోందని వివరించారు. సొలభం-2 (గొందివానిపాలెం)లో 537, బోయితిలిలో 1119 దవపత్రాలు జారీ చేయటం జరిగిందని, అందుబాటులో ఉన్నవారికి పంపిణీ చేసామని, మిగిలిన వారికి వాలంటీర్ల ద్వారా ఇంటింటికి పంపిణీ చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేఖాదికారి డిపిఆర్ఓ పి.గోవింద రాజులు, తహసిల్దార్ అప్పలస్వామి, ఎంపిడిఓ చంద్రశేఖర్, సర్పంచ్‌లు హనుమంత రావు, మాలమ్మ, ఎంపిటిసిలు చిన్నారావు, మాజీ ఎంపిపి బుజ్జి, పిఎసిఎస్ చైర్మన్ నాయుడు, సూరిబాబు, రత్నకుమారి, ఇతర పంచాయతీల సర్పంచ్ లు కె.రాంబాబు, కొండబాబు, వైస్ ఎంపిపి సత్యనారాయణ, ఎంపిటిసిలు, సన్యాసి దొర, జెఎస్ఎస్ ఇంచార్జ్ లెంకల కళ్యాణ్, ఐసిడిఎస్, వెలుగు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

4,050 ధ్రువపత్రాల పంపిణీ : కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లాలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 4,050 ధృవపత్రాలు పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 7 మండలాల పరిధిలోని 10 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. 10,264 గృహల నుంచి వాలంటీర్ల యాప్‌లో వివిధ సర్టిఫికెట్ల కోసం 7,780 వినతులు రాగా, 8,816 టోకెన్లు నమోదు చేయడం జరిగిందన్నారు. 7,818 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందని, అందులో 4,050 సర్టిఫికెట్లు పంపిణీ చేశామని తెలిపారు. 41 దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా మిగిలిన సర్టిఫికెట్లు రానున్న రెండు, మూడు రోజుల్లో వాలంటీర్ల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

డ్వాక్రా గ్రూపులకు రుణమాఫీ వర్తింపజేయాలి

ప్రజాశక్తి- అరకులోయ: డ్వాక్రా గ్రూపులకు రుణమాఫీ వర్తింపజేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.విజయ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, అరుకులోయ మండలంలో 1200 డ్వాక్రా గ్రూప్ లు ఉండగా అన్ని గ్రూప్‌లకు రుణ మాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారని ఆమె అన్నారు.మండలంలో 950 గ్రూప్ లకు రుణమాఫీ కాలేదన్నారు. ఎన్నికల ముందు అక్క చెల్లెలకు ఎంతో మేలు చేస్తునట్టు హమీలు ఇచ్చి మెసం చేయడం జగన్ ప్రభుత్వానికి తగదన్నారు.ఎన్నికల ముందు అప్పు ఉన్న వాళ్ళకే రుణ మాఫీ చేయడం సరైన పద్ధతి కాదని ఆమె అన్నారు.ఈ మేరకు ఏపిఎంకు వినతి పత్రం సమర్పించారు. భవిష్యత్ లో రుణమాఫీ వర్తించని అన్ని గ్రూపు లను కలుపుకుని అందోళన కార్యక్రమాలు చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, సుర్యకాంతం పాల్గొన్నారు.



ఎపిఎంకు వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నాయకులు విజయ

ఓటరు సర్వే పక్కాగా నిర్వహించండి

ప్రజాశక్తి-పాడేరు టౌన్/ జి.మాడుగుల: ఓటరు సర్వేను ఫక్కాగా నిర్వహించాలని జెసి జె.శివ శ్రీనివాసు ఆదేశించారు. జి.మాడుగుల మండలంలో సోమవారం సొలభం-2 (గొందిపాడు) లో జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న జెసి తిరుగు ప్రయాణంలో కొత్తూరు గ్రామంలో జరుగుతున్న ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా బిఎల్ఓలకు పలు సూచనలు చేసారు. ఓటరు వెరిఫికేషన్‌లో తప్పని సరిగా పేరు, తండ్రి/భర్త పేరు, ఫోటో, పుట్టిన తేది, చిరునామా, మొబైల్, ఆదార్ నంబర్లు తదితర వివరాలు పరిశీలించాలని ఆదేశించారు. బిఎల్ఓ యాప్‌లో సరి చేయాలని, అదేవిధంగా ఆధార నంబర్ సవరణకు ఫారం -6బి, మిగిలిన సవరణలకు ఫారం -8 వినియోగించాలని, కొత్తగా ఓటరు నమోదుకు ఫారం -6, మరణించిన వారి పేర్లు తొలగింపుకు ఫారం -7 వినియోగించి మాత్రమె చేర్పులు, తొలగింపులు చేయాలని ఆదేశించారు. నెట్ సౌకర్యం లేక యాప్ పని చేయని సందర్భాలలో ఇంటింటి సర్వే చేసినప్పుడే ఆయా ఓటర్ల వివరాలు ఒక ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేసుకుని కార్యాలంకు వచ్చిన తదుపరి వాటిని ఆన్ లైన్ లో సవరించాలని సూచించారు.

ఈ తనిఖీలో మండల తహసిల్దార్ అప్పలస్వామి, మండల ప్రత్యేఖాధికారి డిపిఆర్ఓ గోవింద రాజులు, విఆర్ఓ కుమారి, బిఎల్ఓలు జీవన్, తరుణ్, సత్యనారయణ, తదితరులు పాల్గొన్నారు.

సగం మండలాల్లో లోటు

- వర్షాల్లేక ముందుకు సాగని సాగు
- ఏడు శాతమే పంట నమోదు
- ఊరటనిచ్చిన చినుకులు
- సిద్ధం చేస్తున్న నారు మడులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ సీజన్ నిరాశజనకంగానేవుంది. సగం మండలాల్లో వర్షపాతం లోటువుంది. దీంతో సాగు విస్తీర్ణంలో ఏడు శాతమే పంటలు నమోదయ్యాయి. సాగునీటి వనరులు సమృద్ధిగాలేకపోవడం, వర్షాలు లేమి కారణంగా పంటల సాగుపై ప్రభావం పడింది. జలాశయాల్లో వాటి సామర్థ్యానికి తగిన నీటి నిల్వలులేవు. ప్రణాళిక విభాగం అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చిన వర్షపాతం వివరాలను పరిశీలిస్తే ఈ ఏడాది జూన్ ఒకటి నుంచి జులై 24 వరకు జిల్లాలోని 24 మండలాలకుగానూ 12 మండలాల్లో వర్షపాతం లోటువుంది. ఈ వర్షపాతం లోటు ప్రభావం ఖరీఫ్ సాగు విస్తీర్ణంపై స్పష్టంగా కన్పిస్తోంది. జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు 1.06 లక్షల ఎకరాలకు (80 శాతం) సరిపడా రైతులు నారుమడులు సిద్ధంచేశారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆకుల పోతకు మడులు సిద్ధంచేస్తున్నారు. మునగపాక మండలంలో బోర్ల కింద తప్ప మిగిలిన చోట్ల ఆకులు పోయలేదు. వ్యవసాయ శాఖ అనకాపల్లి డివిజన్‌లో 75.4 శాతం, యలమంచిలి డివిజన్‌లో 46 శాతం, పాయకరావుపేట డివిజన్‌లో 66 శాతం ఆకులు పోశారు. వర్షాలు ఎక్కువగా నమోదైన చోడవరం డివిజన్‌లో 93.2, నర్సీపట్నం డివిజన్‌లో 96 శాతం ఆకులు పోశారు. ఎండిపోతున్న నారు మడులను ప్రస్తుత వర్షాలు నిలబెట్టాయి.

ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 2,04,980 ఎకరాలకు సోమవారం (జులై 24)నాటికి 14,932 ఎకరాల్లో పంటల సాగు నమోదైంది. 2021 జులై 24 నాటికి 29,285 ఎకరాల్లో పంటలు సాగుకాగా, 2022 జులై 24 నాటికి 32,242 ఎకరాల్లో నమోదైంది. ఈ ఏడాది గతేడాదితో పోల్చిచూస్తే వర్షాల్లేకపోవడంతో సగం సాగు నమోదుకాలేదు. వరి సాధారణ సాగు విస్తీర్ణం 1.36 లక్షల ఎకరాలకు 127 ఎకరాల్లో పంట నమోదైంది. గతేడాది ఇదే కాలానికి 177 ఎకరాల్లో వరి పంట వేశారు. చెరకు సాగు గణనీయంగా తగ్గింది. చెరకు సాధారణ సాగు విస్తీర్ణం 60వేల ఎకరాలకుగానూ 13,300 ఎకరాలకు పడిపోయింది. 2021లో 24,547 ఎకరాలు, 2022లో 27,987 ఎకరాలున్న చెరకు సాగు, 2023 జులై 24 నాటికి 13,300 ఎకరాలకు తగ్గింది. చీడికాడ మండలంలో సాధారణం కంటే 62.5 మిల్లీమీటర్ల వర్షపాతం ఎక్కువ నమోదైంది. దేవరాపల్లి మండలంలో 31.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. అనకాపల్లి మండలంలో 57.8 మిల్లీమీటర్ల వర్షపాతం లోటువుంది. ఇప్పటికైనా వర్షాలు సకాలంలో పడితే వరి పంట పూర్తిస్థాయిలో సాగవుతుందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు.

1న సిఎంచే ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : నగర ప్రజల జీవన విధానానికి తగ్గట్టు ఉపయోగపడే ఇనార్బిట్ మాల్‌ను ఆగస్టు 1వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ తెలిపారు. 45వ వార్డు పరిధిలోని కైలాసపురం రోడ్డులో ఏర్పాటు చేయనున్న ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన, పార్కింగ్, స్టేజి, రెస్ట్ రూమ్ తదితర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్లు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవి కృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రిస్క్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఐఎన్ఎఎస్ అధికారుల కోసం రిస్క్ మేనేజ్‌మెంట్‌పై ఆరు రోజుల శిక్షణను, డిఆర్‌డిఓ శాస్త్రవేత్తల ఐదు రోజుల సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. డిఆర్‌డిఓ మాజీ డైరెక్టర్ జనరల్ (హెచ్ఆర్) కెఎస్.వరప్రసాద్ ప్రారంభోపన్యాసం చేశారు. సంస్థలో ఎదుగుతున్న కొద్దీ నిర్వాహక నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన ప్రాముఖ్యతను తెలిపారు. ప్రాజెక్ట్‌లను విజయవంతంగా పూర్తి చేయాలని, మానవ వనరులను ఉపయోగించాలని సూచించారు.

స్పందన అర్జీలను పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రజాశక్తి-రంపచోడవరం : స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలను పరిష్కరించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజలను అర్జీలను సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ ఎపిఓ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. 17 దరఖాస్తులు వచ్చాయి. నేషనల్ హైవే 516ఇ రోడ్డు వెడల్పు నిమిత్తం గంగవరం మండలం ఎండపల్లి గ్రామంలో బస్ షెల్టర్, రామాలయం, చర్చి, మంచినీటి బావి, బోర్లు తొలగించారని, వెంటనే వాటిని వేరే ఒకచోట నిర్మించాలని ఆ గ్రామ సర్పంచ్ బండారు రామలక్ష్మి దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి మండలం దూసరపాము గ్రామంలో నేషనల్ హైవే 516ఇ రోడ్డు వెడల్పులో నష్టపోయిన భూమికి నష్టపరిహారం మంజూరు చేయాలని కనిగిరి రామలక్ష్మి కోరారు. వై.రామవరం మండలం చింతలపూడి పంచాయితీలో ఫైబర్ నెట్ వర్క్ పనిచేయడం లేదని, వెంటనే రిపేర్ చేయించాలని ఆ గ్రామ సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజ్, డిఎస్ శాస్త్రి, డిఎస్ఓ శ్యాం కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, నాగేశ్వరరావు, ఎండి యూసఫ్, కె.సుబ్బయ్య, డాక్టర్ ఓబి ఇందిరా, ఎడిఎంహెచ్ఓ డాక్టర్ జి.భాస్కర్, డాక్టర్ రాధిక, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి.చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -సీలేరు : రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని పాడేరు శాసనసభ్యులు కె.భాగ్యలక్ష్మి అన్నారు. జీకే వీధి మండలం, జర్రెల గ్రామ సచివాలయం పరిధిలోని కొండ్రుపల్లి, రాళ్లగడ్డ, రాసకోట, జె.కొత్తూరు గ్రామాలలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు 180 గడపలను సందర్శించారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ప్రభుత్వ అందిస్తున్న వివిధ పథకాలను వివరాలు ప్రజలకు తెలియజేసే పత్రాలను పంపిణీ చేశారు. జెడ్పిటిసి కిముడు శివరత్నం, ఎంపీపీ బోయిన కుమారి, స్థానిక సర్పంచ్ విరాజు నాగరాజు, ఉప సర్పంచు చిలకల చిన్నతల్లి, ఎంపిటిసి అడపా లోవకుమారి, వైస్ ఎంపీపీలు సప్పగడ్డ ఆనంద్, దేవుడు, పిఎసిఎస్ చైర్మన్ ప్రసాద్, గ్రామ పెద్ద విష్ణుమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్, నాయకులు కంకిపాటి గిరిప్రసాద్, అవసరాల రాజేష్, సత్తిబాబు, అరికట్ల అంజి, రామకృష్ణ పాల్గొన్నారు.

అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి

ప్రజాశక్తి- కూనవరం : మండలంలోని చిన్నర్యూర్ పంచాయతీ సర్పంచ్ అభిరామ్ తన అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని సిపిఎం నాయకులు సోమవారం ఒక ప్రకటనలో హితవుపలికారు. మండలంలోని ముల్లూరు రచ్చబండ వద్ద చింతచెట్టు సోమవారం పడిపోయి విద్యుత్ వైర్లు తెగి ఇబ్బంది కలిగిన పరిస్థితుల్లో గ్రామ సర్పంచ్ బొగ్గా వెంకమ్మ వెంటనే స్పందించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. వారు వెంటనే విద్యుత్ నిలుపుదల చేసి స్థానిక ప్రజల సహకారంతో చెట్టును తొలగిస్తూ విద్యుత్ పునరుద్ధరణకు అధికారుల శ్రమిస్తుంటే.. చిన్నర్యూర్ సర్పంచ్ అభిరామ్ వాట్సాప్‌లో వచ్చిన ఫొటోని తనకు అనుకూలంగా మలుచుకుని తనని తానుగా యంగ్ డైనమిక్ లీడర్‌గా క్రియేట్ చేసుకోవడం దారుణమన్నారు. స్థానిక సర్పంచ్ బొగ్గా వెంకమ్మ తన పంచాయతీ ప్రజల సమస్యల పట్ల అంకిత భావంతో పనిచేస్తూ వరదల సమయంలో, పోలవరం నిర్వాసితుల సమస్యలపై పని చేస్తున్నారని తెలిపారు. ఒక మహిళా సర్పంచ్ అంకిత భావంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వైసిపి సర్పంచ్ అభిరామ్ తప్పుడు మెసేజులు, తప్పుడు ప్రచారాలు ఆపి ఆయన పంచాయతీ సమస్యలు తీర్చి దిశగా అడుగులు వేస్తే మంచిదని హితవుపలికారు.

బురదలో కూరుకుపోయిన బస్సు

జాతీయ రహదారిపై ఇక్కట్లు పడ్డ ప్రయాణికులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని తంటికొండ గ్రామం వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఎన్‌హెచ్-516ఇ రహదారి మధ్యలో సోమవారం ఏలేశ్వరం డిపోకి చెందిన బస్సు బురదలో కూరుకుపోయి నిలిచిపోయింది. గత మూడు రోజులగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎన్‌హెచ్516ఇ రహదారి బురదమయంగా మారింది. సోమవారం ఏలేశ్వరం నుండి నర్సీపట్నం వెళ్లే ఏలేశ్వరం డిపో ఆర్టీసీ బస్సు తంటికొండ గ్రామానికి వచ్చేసరికి ఆ బురదలో కూరుకుపోయింది. బస్సు డ్రైవర్ ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారి నిర్మాణం చేపట్టే క్రమంలో సంబంధిత సిబ్బంది సరైన జాగ్రత్తలు పాటించకపోవడం వలన ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రహదారి బురదమయంగా మారడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు జారిపడిపోవడంతో గాయాల పాలవుతున్నారు. సంబంధిత అధికారుల సిబ్బంది రహదారిపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో బాటు, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రహదారి మధ్యలో నిలిచిపోయిన ఏలేశ్వరం డిపో ఆర్‌టిసి బస్సు.

పోలీసుల విస్తృత తనిఖీలు




వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు :మావోయిస్టు పార్టీ వారోత్సవాలు నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా అప్రమత్తమయ్యారు. జీకే సిఐ అశోక్ కుమార్, స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో సీలేరు పరిసర ప్రాంతాల్లో సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. సీలేరు ముఖ్య కుడళ్ళు వద్ద, జల విద్యుత్ కేంద్రం, సీలేరు రిజర్వాయర్లు పరిసర ప్రాంతాల్లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆర్టీసీ బస్సులను నిలుపుదల చేసి క్షుణ్ణంగా తనిఖీలు చేసి విడిచిపెట్టారు. మావోయిస్టు పార్టీ ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నారు. దీంతో పోలీసు ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు మావోయిస్టు నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు కదిలికలపై ప్రత్యేక దృష్టి సారించారు. అపరిచిత వ్యక్తులపై పోలీసులు నిఘా పెట్టారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -సీలేరు : రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని పాడేరు శాసనసభ్యులు కె.భాగ్యలక్ష్మి అన్నారు. జీకే వీధి మండలం, జర్రెల గ్రామ సచివాలయం పరిధిలోని కొండ్రుపల్లి, రాళ్లగడ్డ, రాసకోట, జె.కొత్తూరు గ్రామాలలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు 180 గడపలను సందర్శించారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ప్రభుత్వ అందిస్తున్న వివిధ పథకాలను వివరాలు ప్రజలకు తెలియజేసే పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కిముడు శివరత్నం, ఎంపీపీ బోయిన కుమారి, స్థానిక సర్పంచ్ విరాజు నాగరాజు, ఉప సర్పంచు చిలకల చిన్నతల్లి, ఎంపిటిసి అడపా లోవకుమారి, వైస్ ఎంపీపీలు సప్పగడ్డ ఆనంద్, దేవుడు, పిఎసిఎస్ చైర్మన్ ప్రసాద్, గ్రామ పెద్ద విష్ణుమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్, నాయకులు కంకిపాటి గిరిప్రసాద్, అవసరాల రాజేష్, సత్తిబాబు, అరికట్ల అంజి, రామకృష్ణ పాల్గొన్నారు.



గడపగడపలో సంక్షేమ బ్రోచర్లు ఇస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్‌కు అవార్డు

ప్రజాశక్తి-చింతూరు: పలిస్టిక్ మెడిసిన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ కాంగ్రెస్ ట్రెడిషనల్ మెడిసిన్ మహాసభలు న్యూఢిల్లీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరిగాయి. ఈ మహాసభలో ప్రపంచ దేశాల నలుమూలల నుండి సాంప్రదాయ వైద్యులు హాజరైనారు. హెచ్ఎంఆర్ఎఫ్ డైరెక్టర్ ఆఫ్ జనరల్ దీపక రౌత్, వరల్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ సుభాని, పిహెచ్‌సిసి ఫౌండర్, డైరెక్టర్ ఆఫ్ జనరల్ ప్రొఫెసర్ డాక్టర్ పిఎస్ సాగర్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సాంప్రదాయ వైద్య మహాసభలకు ముఖ్య అతిథులుగా నేపాల్ దేశానికి చెందిన డాక్టర్ రామ్ అధర్ యాదవ్ (హెల్త్ మినిస్టర్) హాజరయ్యారు. చింతూరు మండలం నిమ్మలగూడెం గ్రామానికి చెందినప్రముఖ ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్‌కు దేశ రాజధాని ఢిల్లీలో సాంప్రదాయ ఆయుర్వేద అవార్డును ప్రపంచ దేశాల నుండి వచ్చిన ప్రొఫెసర్లు జమాల్ ఖాన్‌ను వేదికపైకి ఆహ్వానించి రాష్ట్రీయ వైద్య సన్మాన్ అవార్డు, స్టార్ సిల్వర్ అవార్డు అందజేశారు. ఈ అంతర్జాతీయ సాంప్రదాయ వైద్య మహాసభల్లో యూకే, బంగ్లాదేశ్. నేపాల్. సింగపూర్. శ్రీలంక, పిలిపియన్స్, కెనడా, ఆస్ట్రేలియా, మలేషియా ఇండోనేషియా నుండి 600 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

108లో ప్రసవం : తల్లీబిడ్డ క్షేమం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వాతంగి గ్రామానికి చెందిన చింతల జ్యోతి సోమవారం 108 వాహనంలో ప్రసవించి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. జ్యోతికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు తొలిత జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కాన్పు కష్టం కావడంతో వైద్య సిబ్బంది చికిత్స అనంతరం ఏలేశ్వరం ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీంతో జ్యోతిని 108 వాహనంలో ఏలేశ్వరం తరలిస్తుండగా మార్గమధ్యలో సి.రాయవరం సమీపంలో జ్యోతికి పురిటి నొప్పులు ఎక్కువై 108లోనే పురుడు పోసుకుంది. అనంతరం 108 సిబ్బంది తల్లీబిడ్డను ఏలేశ్వరం ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా 108 సిబ్బందిని పలువురు అభినందించారు.



108లో ప్రసవించిన జ్యోతి

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆదివారం రాత్రి మృతి చెందారు. జడ్డంగి ఎస్ఐ షరీఫ్ కథనం ప్రకారం... మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన గిరిజనుడెఉ కుంజం రామారావు (55) నిత్యం మద్యం సేవిస్తుండడంతో ఆయన భార్య మద్యం తాగొద్దని మందలించింది. దీంతో రామారావు క్షణికావేశంలో ఈ నెల 22న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు రామారావును తొలిత ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు. అక్కడ రామారావు చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. రామారావు భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజశక్తి-రాజవొమ్మంగి : బీసీ, ఈబిసి, సంచార జాతుల విద్యార్థులు పిఎం యశస్వి ఉపకార వేతనాల కొరకు ఆగస్టు10 లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారిని రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులు ఈ ఉపకారవేతనాలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 29న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రవేశ పరీక్ష ఉంటుందని, మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన తొమ్మిదో తరగతి విద్యార్థులకు సంవత్సరానికి రూ.75 వేలు, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు రూ1.25లక్షలు కళాశాల, హాస్టల్ ఫీజులకు విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు అందుబాటులో ఉన్న బీసీ వసతి గృహ అధికారిని సంప్రదించాలని కోరారు.



బీసీ సంక్షేమ అధికారిని రాజేశ్వరి

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి :ప్రకృతి వ్యవసాయం చేయడం వలన భూమిని, మన ఆరోగ్యం కాపాడు కోవడమే కాకుండా పెట్టుబడులు తగ్గి ఆరోగ్య కరమైనా ఆహారం పండించగలుగుతామని అడ్డతీగల మండలం పులిగోగులపాడు, రాజవొమ్మంగి మండలం చికిలింత యూనిట్ ఇన్‌ఛార్జులు వైవి పద్మజ, గంపా నాగరాజు, కె అప్పలరాజు, రత్నరాజు అన్నారు. సోమవారం అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లోని పులిగోగులపాడు, కింద్రకాలనీ గ్రామాల్లో బీజామృతం తయారీ విధానం, ఉపయోగాలు గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. నాలుగు కిలోల బెల్లం, నాలుగు కిలోల చేపలతో ఎకరానికి సరిపడా మందును తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఈ మందును పంటపై పిచికారి చేస్తే చెడ్డ పీడలు తొలగిపోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం దశపర్ని కషాయం తయారీ విధానం, ఉపయోగాలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు లోవరెడ్డి, లక్ష్మణరెడ్డి, సత్యనారాయణ, ఎల్ సత్తిబాబు, విశ్వనాథరెడ్డి, లక్ష్మి, పలువురు రైతులు పాల్గొన్నారు.